
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



సోమశిలలో 8.31 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 8.316 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 230 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.74,440
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,649
3 శాతం జీఎస్టీతో	రూ.6,848
నవర (8గ్రాములు)	రూ.54,784



మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల జనరల్ అబ్జర్వర్ నితిన్‌సింగ్ బదారియా కలెక్టర్ హరినారాయణన్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. పలు అంశాలపై చర్చించారు.

న్యూస్‌రీల్

డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ మధుమతి తెలిపారు. ఉదయం నిర్వహించిన ఐదో, ఆరో సెమిస్టర్ పరీక్షలకు 5573 మందికి గానూ 5032 మంది హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 703 మందికి గానూ 44 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

చెక్‌పోస్టులో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు



నెల్లూరు(క్రైమ్): నగరంలోని బుజబుజనెల్లూరులో ఏర్పాటు చేసిన ఏఎస్టీ చెక్‌పోస్టును ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ బుధవారం అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెల్లవారుజాము వరకు తనిఖీలను స్వయంగా నిర్వహించి.. వాహన పత్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. పొరుగు మద్యం జిల్లాలోకి రాకుండా కట్టడి చేయాలని సూచించారు. ఎన్నికలు ముగిసేంత వరకు సిబ్బంది తమ విధులను అప్రమత్తంగా నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై సీ – విజిల్ యాప్, టోల్ ఫ్రీ నంబర్ 112 లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్లో సమాచారం అందిస్తే తగు చర్యలు చేపడతామని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పది, ఇంటర్ ఓపెన్ పరీక్ష ఫలితాల విడుదల

నెల్లూరు(అర్బన్): పదో తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షల ఫలితాలను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది.

- పదో తరగతి ఓపెన్ పరీక్షలను జిల్లాలో 1624 మంది రాయగా, 1473 మంది ఉత్తీర్ణులయ్యారు. 90.70 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- ఇంటర్మీడియట్‌కు సంబంధించి 3457 మంది పరీక్షలు రాయగా, 2985 మంది ఉత్తీర్ణులయ్యారు. 86.35 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పై రెండింటిలోనూ రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలిచింది.

పాలిసెట్‌కు పక్కాగా ఏర్పాట్లు

నెల్లూరు(అర్బన్): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించిన పాలిసెట్‌కు ఏర్పాట్లను పక్కాగా చేయాలని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, పాలిసెట్ నిర్వహణ కన్వీనర్ విజయ్‌కుమార్ కోరారు. పరీక్షకు సంబంధించిన చీఫ్ సూపరింటెండెంట్లు, సిబ్బందితో దర్గామిట్టలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షను నిర్వహించనున్నామని వివరించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం పదింటికే అనుమతించాలని సూచించారు. నెల్లూరు సిటీలో నాలుగు.. ఆత్మకూరు, కావలిలో రెండు చొప్పున కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షకు 3908 మంది హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సదుపాయాలను కల్పించాలని కోరారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఎస్‌ఈబీ తనిఖీలు


- మూడు కిలోల గంజాయి స్వాధీనం



నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలను ఎస్‌ఈబీ నెల్లూరు – 1 ఇన్‌స్పెక్టర్ విజయ భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. విజయవాడ నుంచి తిరుపతి వెళ్తున్న ఆర్టీసీ బస్సులోని ఓ బ్యాగ్‌లో మూడు కిలోల గంజాయిని గుర్తించారు. సదరు బ్యాగ్‌పై ప్రయాణికులను ఆరాతీయగా, ఎవరూ తమది కాదని చెప్పారు. దీంతో బ్యాగ్‌ను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగదు, మద్యం అక్రమ రవాణా కట్టడిలో భాగంగా తనిఖీలను నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు.

సమాచార చోరులు

నగరంలో ఓటర్ల స్వేచ్ఛకు భంగం కలిగించేలా టీడీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి నారాయణ వికృత క్రీడకు తెరలేపారు. ఎన్నికల్లో విజయం కష్టమనే సంకేతాల తరుణంలో ఎన్ని అడ్డదారులైనా తొక్కేందుకు ఆయన సై అంటున్నారు. ఎన్ టీమ్, మహిళా శక్తి, నారాయణ యూత్ టీమ్ అంటూ రెండు వేల మందిని నియమించుకొని.. వీరికి నెలనెలా జీతాలిస్తూ ఎన్నికల కార్యక్రమాలను చేయించుకుంటున్నారు. సిటీ నియోజకవర్గ పరిధిలోని ఓటర్లకు ఫోన్లు చేయడం.. వారి వ్యక్తిగత వివరాల సేకరణ.. తదితరాలను ఆరాతీయడం వీరి దినచర్య. వీరి వ్యవహారాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే, ఓటరు జాబితా వెరిఫికేషన్ కోసం తమను ప్రభుత్వం నియమించిందంటూ అబద్ధాలు చెప్తుండటం గమనార్హం.



నగరంలో వికృత క్రీడకు తెరలేపిన నారాయణ

- నెలనెలా జీతాలిస్తూ రెండు వేల మందితో టీమ్
- ఓటర్ల డేటా సేకరణలో నిమగ్నం
- ఫోన్లు చేస్తూ వ్యక్తిగత వివరాల ఆరా
- స్థానికంగా లేని వారి పేరిట ఫేక్ కార్డులు
- దొంగ ఓట్లు వేసేలా శిక్షణ

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా టీడీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి నారాయణ కుటిల యత్నాలను ప్రారంభించారు. డబ్బును ఎరవేసి పలువురు నేతలను ఆకర్షిస్తున్నా, ఆయన గెలుపు అసాధ్యమనే సంకేతాల తరుణంలో మరో దుష్ట పన్నాగానికి తెరలేపారు. పోలింగ్ రోజున దొంగ ఓట్లు వేయించేందుకు అద్దె బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చి.. వారిని సిద్ధం చేస్తున్నారనే సమాచారం ఆందోళన కలిగిస్తోంది. స్థానికంగా ఉన్న టీడీపీ నేతలు, కేడర్‌ను దూరం పెట్టి, తన అద్దె బ్యాచ్ ద్వారానే కార్యకలాపాలను సాగిస్తున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఇదీ పన్నాగం..

నారాయణ ఏర్పాటు చేసుకున్న అద్దె బ్యాచ్ సిటీ పరిధిలోని 26 డివిజన్లలో 2.37 లక్షల ఓటర్ల సమాచారాన్ని సేకరించే పనిలో నిమగ్నమైంది. ఓటర్లకు ఫోన్ చేసి స్థానికంగా ఉంటున్నారా.. లేకపోతే ఎక్కడుంటున్నారు.. ఓటరు జాబితాలో ఉన్న ఇంటి నంబర్‌లోనే ఉన్నారానంటూ ఆరాతీస్తున్నారు. వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్న తరుణంలో ఎవరైనా ప్రశ్నిస్తే.. ఓటరు జాబితా వెరిఫికేషన్ కోసం తమను ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిందంటూ తప్పించుకునే యత్నం చేస్తున్నారు. తాను స్థానికంగా లేనని ఎవరైనా ఓటర్లు చెప్తే.. మీరు ఓటేయడానికి రారు కదానని సైతం ప్రశ్నిస్తున్నారు. ఇలా ఓటేయడానికి రాని వారిని గుర్తించి వారి పేరుతో ఉన్న ఫేక్ ఐడెంటిటీ కార్డుతో దొంగ ఓట్లు వేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారని తెలుస్తోంది.

అడ్డాగా నారాయణ మెడికల్ కళాశాల..

తన విద్యాసంస్థల మొదలుకొని వైద్య కళాశాల వరకు అన్నింటినీ రాజకీయాలకు వేదికగా నారాయణ మార్చారు. నారాయణ వైద్య కళాశాలలోనే తన నివాసం ఉండటంతో అక్కడి నుంచే రాజకీయ కార్యకలాపాలను సాగిస్తున్నారు. అద్దె బ్యాచ్‌కు ఇక్కడే శిక్షణ ఇస్తున్నారని తెలుస్తోంది. ఎన్నికల నిధి సేకరణ కోసం కళాశాలలో ప్రత్యేక కౌంటర్లను గతంలో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇక్కడి నుంచే దాదాపు రూ.900 కోట్ల ఎన్నికల ఫండ్‌ను ఆయన సేకరించారని తెలుస్తోంది. ఈ పరిణామాల క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి నారాయణ వైద్యశాలకు వచ్చే రోగులు, అక్కడే నివాసం ఉంటున్న నర్సింగ్ సిబ్బంది, వైద్యులు ఇబ్బంది పడుతున్నారు. నారాయణ వైద్య కళాశాలలో ఇంత బహిరంగంగా రాజకీయ కార్యకలాపాలు జరుగుతున్నా, అధికారులు నిఘా సారించకపోవడం గమనార్హం.

సిబ్బందినీ వదలని వైనం

తన రాజకీయ అవసరాల కోసం నారాయణ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది, ఉద్యోగుల సేవలను సైతం ఆయన వినియోగించుకున్నారు. ఓటరు వెరిఫికేషన్ పేరుతో వీధుల్లోకి పంపి చావుదెబ్బలు తినేలా చేశారు. తమను విస్మరించి అద్దె బ్యాచ్‌కే ప్రాధాన్యమిస్తుండటంతో పార్టీ కేడర్ సైతం ఆయనకు సహకరించే పరిస్థితి కనిపించడం లేదు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల వెల్లడి

నెల్లూరు(అర్బన్): జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన జేఈఈ మెయిన్స్ రెండో విడత ఫలితాలను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశానికి ఎన్టీఏ నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లా నుంచి సుమారు ఎనిమిది వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 83 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లాకు చెందిన సూరజ్ జాతీయ స్థాయిలో 17, లావణ్య చంద్రిక 1028, రితేష్‌రెడ్డి 1269, శ్రీనికేష్ 1475 ర్యాంకులను సాధించారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు

నెల్లూరు(బారకాసు): ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రవర్తన నియమావళిని జిల్లాలో పక్కాగా అమలు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వ్యయ.. సాధారణ పరిశీలకులతో కలెక్టర్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ గురువారం సమావేశమయ్యారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, జిల్లా భౌగోళిక పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. గత ఎన్నికల్లో 79 శాతం పోలింగ్ నమోదైందని, ఈ సారి 85 శాతానికి పెంచేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. సాధారణ పరిశీలకులు రామ్‌కుమార్‌గౌతమ్, నితిన్‌సింగ్, కరేగౌడ, పోలీస్ పరిశీలకులు అశోక్ దూబే, ఎన్నికల వ్యయ పరిశీలకులు జ్యోతిమోయ్‌బైలాంగ్, కంచన్‌రామ్‌మీనా, ప్రసాద్ దత్తాత్రేయ, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.

జనసంద్రమైన సింహపురి



నామినేషన్‌ను సమర్పిస్తున్న ఖలీల్ అహ్మద్

- నామినేషన్ దాఖలు చేసిన ఖలీల్ అహ్మద్

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ నామినేషన్ ఘట్టం గురువారం కోలాహలంగా సాగింది. వేలాది మంది పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలిరావడంతో నగరం జనసంద్రమైంది. తొలుత విజయమహల్ గేట్ సమీపంలోని రాజన్న భవన్ నుంచి ఖలీల్ అహ్మద్, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి భారీ ర్యాలీని చేపట్టారు. రామ్మూర్తినగర్‌లోని పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి క్యాంప్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ విజయసాయిరెడ్డిని కలుసుకున్న అనంతరం అర్చకులు, ముస్లిం మతపెద్దలు, పాస్టర్ల ఆశీర్వాదాన్ని ఖలీల్ అందుకున్నారు. అనంతరం రామలింగాపురం అండర్‌బ్రిడ్జి, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, కేవీఆర్ పెట్రోల్ బంక్, డీకేడబ్ల్యూ కళాశాల మీదుగా నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకొని తన నామినేషన్ పత్రాలను ఆర్వో వికాస్ మర్మత్‌కు అందజేశారు. తదుపరి బారాషహీద్ దర్గాలో ప్రార్థనలు చేశారు.



అభిమానులతో కలిసి ర్యాలీగా వస్తూ..

రాష్ట్రంలో జనరంజక పాలన

- దేశంలోనే ఉత్తమ స్థానంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, పక్కన ప్రసన్న

ఇందుకూరుపేట: రాష్ట్రంలో జనరంజక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని దేశంలోని ప్రతి ముఖ్యమంత్రి అభినందిస్తున్నారని, సుపరిపాలనతో దేశంలోనే ఆయన అత్యుత్తమ స్థానంలో ఉన్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తూరు, ఇందుకూరుపేటలో పార్టీ కోవూరు అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తితో కలిసి గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. టీడీపీ తరఫున ధనవంతులు డబ్బు సంచులతో వచ్చారని, ఎన్నికల్లో రూ.వెయ్యి కోట్లను వేమిరెడ్డి ఖర్చుపెడుతున్నారని ఆరోపించారు. రూ.500 కోట్ల వరకు ఖర్చుపెడతామని ప్రశాంతిరెడ్డి చెప్తున్నారన్నారు. పేదలు, బడుగు, బలహీనవర్గాలకు కావాల్సింది ఇల్లు, మంచి విద్య, వైద్యమని చెప్పారు. వీటన్నింటినీ అందిస్తున్న ఘనత సీఎంకే దక్కుతుందని కొనియాడారు. ఐదేళ్లపాటు సుపరిపాలన సాగించారని, రానున్న ఐదేళ్లలో మరింత జనరంజక పాలనను అందించనున్నారని వివరించారు.

జన్మభూమి కమిటీలతో ఇబ్బందులు

చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో జన్మభూమి కమిటీలతో ప్రజలు ఇబ్బంది పడిన అంశాన్ని గుర్తుచేశారు. సంక్షేమ, అభివృద్ధి పాలన కావాలో లేక అవినీతి పాలన కావాలో ఆలోచించాలని ప్రజలను కోరారు. ఆరు దశాబ్దాలుగా ప్రజలతో మమేకమై వారి సమస్యలను నల్లపరెడ్డి కుటుంబం పరిష్కరిస్తోందని చెప్పారు. వేమిరెడ్డికి సమస్యలను తెలియజేయడం అసాధ్యమని, మీలో ఒకరిగా ఉన్న నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కేంద్రంలో తాను.. రాష్ట్రంలో ప్రసన్న ఏ సమస్యనైనా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలకు సేవచేసి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచేవారే నేతలని, నల్లపరెడ్డి కుటుంబం దీనికి ఉదాహరణ అని చెప్పారు. ఎమ్మెల్యేగా ప్రసన్నను.. ఎంపీగా తనను గెలిపించాలని కోరారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

సీఎం ప్రవేశపెట్టిన పథకాలే తమ పార్టీకి శ్రీరామరక్ష అని నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అందరూ ఏకమై జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. కోవూరు నియోజకవర్గంలో టీడీపీని నమ్ముకున్న వారిని కాదని, ఓ కోటీశ్వరురాలిని బరిలో నిలిపారని విమర్శించారు. రాజ్యసభ, టీటీడీ బోర్డు పదవులను పొందిన వేమిరెడ్డి దంపతులు, నెల్లూరులో ఓ ముస్లిం మైనార్టీకి టికెట్ ఇచ్చారనే కారణంతో పార్టీని వీడారని మండిపడ్డారు. డబ్బుతో ఏమైనా చేయొచ్చనే భ్రమలో వారున్నారని, నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులని తెలిపారు. డబ్బున్న వారికి గతంలో ఎలాంటి గుణపాఠం చెప్పారో అందరికీ తెలుసునన్నారు. ఓటమి భయంతో వారు ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు. మంచి మనసున్న వ్యక్తి విజయసాయిరెడ్డి అని, బాహుబలి లాంటి ఆయన్ను ఎన్నికల బరిలో దింపారని చెప్పారు. తొలుత ప్రసన్న, విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం లభించింది. మైపాడుపాళేనికి చెందిన 150 మంది టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొత్తూరులో రాజీనామా చేసిన వలంటీర్లు పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ కోవూరు యువజన విభాగ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఏపీఏల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఇందుకూరుపేట రూరల్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్‌రెడ్డి, భీమవరపు వెంకటకృష్ణారెడ్డి, బుజ్జిబాబు, వెంకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- చివరి రోజు భారీగా నమోదు
- నెల్లూరు లోక్‌సభకు మొత్తం 36 దాఖలు

నియోజకవర్గం	అభ్యర్థులు	సెట్లు
కందుకూరు	35	40
కావలి	33	43
ఆత్మకూరు	28	34
కోవూరు	36	42
నెల్లూరు సిటీ	35	39
నెల్లూరు రూరల్	22	27
సర్వేపల్లి	19	23
ఉదయగిరి	29	42
మొత్తం	237	290

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం గురువారంతో ముగిసింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు గానూ 237 మంది అభ్యర్థులు 290 సెట్లు.. పార్లమెంట్ స్థానానికి 21 మంది 36 సెట్లను దాఖలు చేశారు.

చివరి రోజు ఇలా..

- కోవూరు నియోజకవర్గంలో అత్యధికంగా 24 మంది 27 సెట్లను సమర్పించారు.
- కందుకూరులో 14 మంది 15 నామినేషన్లు.. కావలిలో 8 మంది 9 సెట్లను దాఖలు చేశారు.
- ఆత్మకూరు నియోజకవర్గానికి ఏడు, నెల్లూరు సిటీకి 16 మంది 18 సెట్లు, నెల్లూరు రూరల్‌లో 8 మంది 9 సెట్లను సమర్పించారు.
- సర్వేపల్లిలో ఏడు, ఉదయగిరిలో 14 మంది 20 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు.

విశేషాలంకారంలో ఆంజనేయుడు

నెల్లూరు(బృందావనం): బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారు యాళి వాహనంపై దర్శనమిచ్చారు. ధ్వజావరోహణం, వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా కాసా సుధాకర్, వేలపాటి శ్రీనివాసరావు, డాక్టర్ కొండపల్లి సత్యనారాయణ వ్యవహరించారు.

- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో అశ్వవాహనసేవను నిర్వహించారు. ఉభయకర్తలుగా వెంకటసుబ్రహ్మణ్యం, స్వాతి, మైనంపాటి సుందర్‌కుమార్, పద్మావతి దంపతులు వ్యవహరించారు.
- మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి సన్నిధిలో పుష్పక విమాన అలంకారాన్ని నిర్వహించారు. ఉభయకర్తలుగా సాగిరాజు వెంకటరాజు, సునీత దంపతులు వ్యవహరించారు.



సయోధ్య కుదర్చలేక..

ప్రత్యక్ష రాజకీయాలకు కొత్త.. ఆపై వర్గాలను సమన్వయం చేసుకోవడంలో వైఫల్యం.. గ్రూపుల్లో ఒకరికే మద్దతివ్వడం.. ఇలా వరుస స్వయంకృతాపరాధాలతో టీడీపీ కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి తలబొప్పి కడుతోంది. అడుగడుగునా ఎదురవుతున్న నిరసన సెగలతో ఏమి చేయాలో పాలుపోక ప్రచారాల నుంచే అర్ధాంతరంగా ఆమె నిష్క్రమిస్తున్నారు. ఇందుకూరుపేట మండలం గంగపట్నం మొదలుకొని కోవూరు మండలం గంగవరం వరకు ఇలా ప్రతి చోట గ్రూపు రాజకీయాలు ఆమెకు స్వాగతం పలికాయి. నేతల మధ్య విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయనే దానికి ఈ వరుస పరిణామాలు ఉదాహరణగా నిలుస్తున్నాయి.

- ప్రచారాల నుంచి నిష్క్రమిస్తున్న ప్రశాంతిరెడ్డి
- నేతలను సమన్వయం చేసుకోలేక సతమతం
- తలనొప్పిగా మారిన గ్రూపు రాజకీయాలు
- తాజా పరిణామాలకు వేదికగా గంగవరం
- అయోమయంలో టీడీపీ కేడర్

కోవూరు / ఇందుకూరుపేట: టీడీపీ కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరిస్థితి ఒక అడుగు ముందుకు.. నాలుగడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. రాజకీయాల్లో పరిపక్వత లేకుండా ఆమె వ్యవహరిస్తున్న వైఖరితో నిరసన సెగ మరింత రాజుకుంటోంది. ఫలితంగా నేతల తీరుతో విసిగిపోయి ఆమె ప్రచారాల నుంచి అర్ధాంతరంగా వెనుదిరుగుతుండటం ఆ పార్టీలో అనిశ్చితికి దారితీస్తోంది. ఇందుకూరుపేట మండలం గంగపట్నం మొదలుకొని కోవూరు మండలం గంగవరం వరకు వర్గాల సెగలు రాజుకుంటూనే ఉన్నాయి.

ఇవీ ఉదాహరణలు..

- తొలిసారిగా గంగపట్నంలో ఆత్మీయ సమావేశానికి ప్రశాంతిరెడ్డి వెళ్లారు. ఈ క్రమంలో ఊరి పొలిమేరలోనే టీడీపీలోని ఒక వర్గం అడ్డుకుంది. నచ్చజెప్పేందుకు దాదాపు గంటకుపైగా యత్నించినా, ఫలితం లేకపోవడంతో ఆ రోజున అసహనంతో ఆమె వెనుదిరిగారు.
- బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లిలో ప్రచారానికి వెళ్లిన ఆమెకు రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు స్వాగతం పలికింది. వవ్వేరు బ్యాంక్ మాజీ చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డితో పాటు ఆయన అనుచరులు.. పెనుబల్లి సర్పంచ్ పెంచలయ్య, మరో నేత నారాయణను పోలంరెడ్డి దినేష్‌రెడ్డి వర్గానికి చెందిన సురేంద్ర కాలితో తన్నడంతో కింద పడిపోయారు. ఇరువర్గాల బాహాబాహీతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఇరుపక్షాలను సమన్వయం చేయాల్సిన ఆమె అందుకు భిన్నంగా వ్యవహరించి సూరాను వెళ్లిపోవాలని ఆదేశించారు. తీవ్ర అవమాన భారంతో ఆయన వెనుదిరిగారు.
- బుచ్చిరెడ్డిపాళెంలో పార్టీ కార్యాలయ ప్రారంభ సందర్భంగా సూరా శ్రీనివాసులురెడ్డికి, యత్రం రెడ్డి గోవర్ధన్‌రెడ్డికి మధ్య గొడవ జరిగినప్పుడూ ఆమె మౌనంగానే ఉండిపోయారు.

నువ్వొచ్చి గొడవలు సృష్టించావ్..

తాజాగా కోవూరు మండలం గంగవరంలో ప్రచారానికి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం వెళ్లారు. ఈ క్రమంలో గ్రామంలో టీడీపీకి చెందిన బాబుల్‌రెడ్డి (లక్ష్మీనరసారెడ్డి) వైపు కొందరు, శ్రీధర్‌నాయుడు వైపు మరికొందరు ఉన్నారు. ఆమె రాక సందర్భంగా బాబుల్‌రెడ్డి జిందాబాద్ అని కొందరు అనగానే శ్రీధర్‌నాయుడు ఆగ్రహంతో ఊగిపోయారు. ప్రశాంతిరెడ్డి జోక్యం చేసుకొని శ్రీధర్‌నాయుడికి మద్దతుగా మాట్లాడారు. ఈ తరుణంలో నువ్వు ఎన్నికల ప్రచారానికి వచ్చి మా వాళ్ల మధ్య గొడవలు రేపావు.. వర్గాలు తయారు చేశావు.. నీకో దండం తల్లీ అంటూ.. ప్రచార రథం దిగేసి తన ఇంట్లోకి బాబుల్‌రెడ్డి వెళ్లిపోయి తాళం వేసుకున్నారు. ఈ తరుణంలో బుజ్జగించేందుకు పోతిరెడ్డిపాళేనికి చెందిన అశోక్‌రెడ్డితో రాయబారం నడిపినా బాబుల్‌రెడ్డి ససేమిరా అన్నారు. చివరికి చేసేదిలేక ప్రచార రథం దిగేసి కారులో నెల్లూరుకు ఆమె పయనమయ్యారు.

క్షేత్రస్థాయిలో పరిస్థితిపై అవగాహన లేకే..

టీడీపీకి ప్రతి ఊళ్లో రెండు.. మూడు గ్రూపులు ఉన్నాయి. ఎన్నికల సమయంలో వీరిని సమన్వయం చేసుకోలేక ఆమె చతికిలపడుతున్నారు. మరోవైపు ఆర్థికంగా బలమైన ప్రశాంతిరెడ్డి పోటీ చేస్తుండటంతో ఆధిపత్యం ప్రదర్శించి, ఆర్థిక లావాదేవీల పెత్తనం చేయొచ్చని కొందరు నేతలు భావిస్తున్నారు. కొందరికే మూటలిచ్చి.. ప్రాధాన్యమిస్తుండటంతో వర్గాల సెగ మరింత రాజుకుంటోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి


సభలో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి


ఎన్నికల ప్రచారం చేస్తున్న హిమబిందు, నాయకులు

ప్రజా క్షేత్రంలో..

ప్రచార పర్వం

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అభ్యర్థులు ప్రచారంలో వేగం పెంచారు. నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పనులను వివరిస్తూ ఓట్లు అడుగుతున్నారు. నెల్లూరు ఎంపీగా బరిలో ఉన్న వేణుంబాక విజయసాయిరెడ్డి గురువారం నగరంలోని ఆర్ఎస్ఆర్ మున్సిపల్ స్కూల్ గ్రౌండ్, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియానికి వెళ్లారు. వాకర్స్‌తో ముచ్చటించారు. ఇంకా ట్రంకురోడ్డు, కోమల విలాస్, నర్తకి సెంటర్‌లో టీ దుకాణాల వద్దకు వెళ్లి స్థానికులతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన వెంట నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, నాయకులున్నారు. ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి వింజమూరు మండలంలోని కాటేపల్లి, తమిదపాడు, మాధవరం, వస్నూరుపాళెం, బీసీ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో 30 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆదాలను గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె హిమబిందు 38వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేశారు.

– నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)/ఉదయగిరి/నెల్లూరు సిటీ

క్లుప్తంగా

జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు

• రూ 19.88 లక్షల నగదు స్వాధీనం


ప్రశాంతినగర్ సమీపంలో తనిఖీలు చేస్తున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ బాజీ

నెల్లూరు(క్రైమ్): సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నగదు, మద్యం అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తోంది. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదు, అక్రమ మద్యం, నాటుసారా తదితరాలను సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేస్తున్నారు. బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు చిన్నబజారు పోలీసుస్టేషన్ పరిధిలో రూ.3,19,990, నవాబుపేటలో రూ.1,55,000. సంతపేటలో రూ.4,42,000, వేదాయపాళెంలో రూ.3 లక్షలు, మనుబోలులో రూ.1,20,000, వలేటివారిపాళెంలో రూ.6,51,330 మొత్తంగా రూ.19,88,320 నగదు ఎలాంటి ధ్రువీకరణపత్రాలు లేకుండా తరలిస్తుండగా పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సంగంలో 16 బండిల్స్ కరపత్రాలను పట్టుకున్నారు. బాలాజీనగర్ పరిధిలో 15, బిట్రగుంటలో 30, ఉదయగిరిలో 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. 1,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ప్రజలు రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లాలంటే సంబంధిత పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అందరూ పాటించాలాన్నారు.

బాలసదన్ నుంచి ఇద్దరు బాలికల అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని బాలసదన్ నుంచి ఇద్దరు బాలికలు అదృశ్యమయ్యారు. పోలీసుల కథనం మేరకు.. జలదంకి, మరుపూరు గ్రామాలకు చెందిన ఇద్దరు బాలికలు 15 రోజులుగా రెవెన్యూ కాలనీలోని బాలసదన్‌లో ఉంటున్నారు. గురువారం తెల్లవారుజామున వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఉదయం ఈ విషయాన్ని గమనించిన ఆఫీస్ ఇన్‌చార్జి సంపూర్ణమ్మ వారికోసం చుట్టుపక్కల గాలించారు. జాడ తెలియరాకపోవడంతో జరిగిన విషయాన్ని ఆమె ఉన్నతాధికారులకు తెలియజేశారు. వారి ఆదేశాల మేరకు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడవి పందుల వేటకు వెళ్లి..

• విద్యుదాఘాతంతో యువకుడి మృతి


వెంకటేశ్వర్లు మృతదేహం

సీతారామపురం: మండలంలోని పడమటి రొంపిదొడ్లలో అడవి పందుల వేటకు వెళ్లిన నాగులూరి వెంకటేశ్వర్లు (27) అనే యువకుడు గురువారం తెల్లవారుజామున విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఓ రైతు తన మొక్కజొన్న పంటను అడవి పందుల బారి నుంచి కాపాడుకునేందుకు కంచెకు విద్యుత్ వైర్లు తగిలించాడు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన పలువురు అడవి పందుల వేటగాళ్లు గురువారం తెల్లవారుజామున పడమటి రొంపిదొడ్లకు చేరుకుని సదరు పొలంలో పందులను గుర్తించారు. వారిలో వెంకటేశ్వర్లు తన రెండు కుక్కలను అడవి పందులపైకి వదిలాడు. అతను పంటలో పరుగెత్తగా కంచెకు తగిలి షాక్‌కు గురై మృతిచెందాడు. అలాగే కుక్కలు కూడా చనిపోయాయి. సమాచారం అందుకున్న సీతారామపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

హామీలు నెరవేర్చారు.. గెలిపించండి

• రాష్ట్ర వ్యసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


కాకాణి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

మనుబోలు: 'మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలి. 'పేదల ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడం కోసం ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కాలి' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. మండలంలోని గురివిందపూడి, కొమ్మలపూడి, ముద్దుమూడి, చెరుకుమూడి గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి చూపించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒకవైపు, గతంలో 600కు పైగా హామీలిచ్చి అమలు చేయకుండా మోసం చేసిన చంద్రబాబు ఒక వైపు ఎన్నికల బరిలో ఉన్నారన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. 2014 ఎన్నికల సమయంలో బాబు రుణమాఫీ చేస్తానని రైతులు, పొదుపు మహిళలకు హామీ ఇచ్చి.. తీరా గెలిచాక మోసం చేశాడన్నారు. కల్లబొల్లి మాటలు చెప్పి ఓట్లు వేయించుకుని అధికారంలోకి రావడం ఆపై ప్రజలను వంచించడం బాబుకు వెన్నతో పెట్టిన విద్యన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రవేశ పెట్టి పింఛన్లను లబ్ధిదారులకు ఇంటి వద్దే అందించారన్నారు. ఆయన జనరంజక పాలన అందించారు కాబట్టే ధైర్యంగా మీకు మంచి జరిగిందనిపిస్తేనే నాకు ఓటు వేయండి అడిగారన్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతుండడంతో ఏమి చేయాలో అర్థంగాక చంద్రబాబు ఇప్పుడు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు అవకాశవాద పొత్తులతో వచ్చాడన్నారు. కొమ్మలపూడిలో కాకాణి సమక్షంలో పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, ఎంపీటీసీ శిరీష, నాయకులు మన్నెమాల శ్రీహరిరెడ్డి, వసంతకుమార్‌రెడ్డి, చేవూరు ఓసూరయ్య, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చేడిమాల బుజ్జిరెడ్డి, ఏడెం మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి ప్రాణం మీదకు తెచ్చిన సరదా

• మలద్వారం నుంచి గాలి కొట్టిన వ్యక్తి
• పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు

వెంకటాచలం: సరదా కోసం ఓ వ్యక్తి చేసిన పని బాలుడి ప్రాణం మీదకు తెచ్చింది. ఈ ఘటన వెంకటాచలం మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అనికేపల్లికి చెందిన రాజా అనే వ్యక్తి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సరదా కోసం అతను బుధవారం గ్రామంలోని 12 ఏళ్ల బాలుడి మలద్వారం నుంచి సైకిల్ పంపు ద్వారా గాలి కొట్టాడు. దీంతో అతని పొట్ట ఉబ్బిపోయి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు బాలుడిని వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరు నగరానికి తరలించారు. ఈ విషయంపై బాలుడి తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ అంకమరావు విచారణ చేపట్టారు. రాజాపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.110
సన్నవి	: రూ.90
పండ్లు	: రూ.80



ప్రజలకు చంద్రబాబు చేసింది శూన్యం

• రామిరెడ్డి, మస్తాన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి


ప్రచారం చేస్తున్న ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి

అల్లూరు: 'చంద్రబాబు నాయుడు ప్రజలకు చేసింది శూన్యం. 14 ఏళ్ల పాలనలో చెప్పుకోవడానికి ఒక్క పథకమైనా ఉందా?, పేదల జీవితాల్లో వెలుగులు నిండాలన్నా.. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావాలి' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, వైఎస్సార్‌సీపీ నేత కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇందుపూరు, పురిణి, తూర్పు, పడమర గోగులపల్లి, సింగపేట గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎండను సైతం లెక్క చేయకుండా ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మేలు జరిగి ఉంటేనే ఓట్లు వేయాలని కోరిన దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. చంద్రబాబు గత పాలనంతా అవినీతిమయమన్నారు. రాష్ట్ర సంపదను కొల్లగొట్టడం తప్ప ప్రజల కోసం ఏమీ చేయలేదన్నారు. జగన్‌ను ఎదుర్కొనే దమ్ము లేక ఓటమి భయంతో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే నెల్లూరు జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కందుకూరు అసెంబ్లీ పరిశీలకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, అల్లూరు టౌన్, రూరల్ కన్వీనర్లు దండా కృష్ణారెడ్డి, బీద రమేష్ బాబు, నాయకులు కోడూరు సాధక్‌రెడ్డి, కోడూరు హరిరెడ్డి, పవన్‌రెడ్డి, తాంద్ర మల్లి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 133
లేయర్ (లైవ్) : 93
బ్రాయిలర్ చికెన్ : 236
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 264
లేయర్ చికెన్ : 158



వైఎస్సార్‌సీపీతోనే పేదల జీవితాల్లో వెలుగులు

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

చేజర్ల: వైఎస్సార్‌సీపీ వల్లే పేదల వెలుగులు వచ్చాయని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీఎంగా అవకాశం ఇవ్వాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కోరారు. మండలంలోని పెరుమాళ్లపాడు, పెళ్లేరు, తూర్పుపల్లిరెడ్డివారి కండ్రిక, పుల్లనీళ్లపల్లి, తూర్పుకంభంపాడు, కాకివాయి, కండాపురం గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్నను గెలిపించుకుంటేనే పేదలకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. చంద్రబాబు నాయుడు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. అప్పట్లో చిన్న పని కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో సచివాలయాలు ఉండడంతో పనులు సులువుగా అవుతున్నట్లు చెప్పారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయినట్లు చెప్పారు. ధర్మ యుద్ధం చేస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని, కూటమికి గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి, ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, తూర్పుపల్లి ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నాయకులు బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పూనూరు రామమనోహర్‌రెడ్డి, నాగా నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి, బోడిపాడు మాజీ సర్పంచ్ బి.మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

• వైఎస్సార్‌టీయూసీ జోనల్ ఇన్‌చార్జి రాజారెడ్డి


మాట్లాడుతున్న రాజారెడ్డి, పక్కన వైఎస్సార్‌టీయూసీ నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట): కార్మికుల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌టీయూసీ జోనల్ ఇన్‌చార్జి నారపరెడ్డి రాజారెడ్డి అన్నారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు కార్మికుల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ సేవలు సులువుగా అందేలా చేశారన్నారు. యువతకు ఉద్యోగాలిచ్చారన్నారు. విశాఖపట్నంలో సదస్సు పెట్టి పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండ్ల రాజేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా పర్యటనలో చంద్రబాబు అబద్ధాలు చెప్పారన్నారు. టీడీపీ హయాంలో అనేక పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కూరపాటి వరప్రసాద్‌రెడ్డి, సునీల్ గవాస్కార్ పాల్గొన్నారు.